

చిన్నారులకు మొక్కలను పంపిణీ చేస్తున్న ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఉత్సాహంగా జీహెచ్‌ఎంసీ హ్యాపీ స్ట్రీట్

ఖైరతాబాద్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రతతో పాటు హరిత వాతావరణంపై ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు. నగర ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం హరిత వాతావరణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఆదివారం సంజీవయ్య చిల్డ్రన్స్ పార్కు వద్ద హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో పిల్లలతో పాటు పెద్దలు పలురకాలైన ఆటలు, గేమ్స్ ఆడి సరదాగా గడిపారు. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షకులైన పిల్లల్లో హరిత వాతావరంపై మక్కువ పెరిగేలా పలు కార్యక్రమాలను నిర్వహించారు. గేమ్స్‌లో విజేతలైన పిల్లలకు, మక్కువ చూపిన వారికి మొక్కలను బహూకరించారు. ఈ సందర్భంగా అనురాగ్ జయంతి మాట్లాడుతూ, నగర పరిశుభ్రతలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని, పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా తీసుకుంటేనే సాధ్యమవుతుందని అన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, మోహన్‌నాయుడు, రాఘవ

కమ్మ కుటుంబాల పిల్లల చదువుకు ఆర్థిక సాయం

ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి

బేగంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కమ్మ కార్పొరేషన్‌తో పాటు సంఘాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కమ్మ కుటుంబాల పిల్లల చదువునకు కృషి చేయడం జరుగుతోందని ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి అన్నారు. ఎస్.ఆర్. నగర్ కమ్మ సేవా సమితి రెండవ కార్తీక వన మహోత్సవాలు సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, శేరిలింగం పల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు సరళ, శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, బీజేపీ మహిళానేత డా.వీరపనేని పద్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున సూరపనేని కృష్ణమనాయుడు ట్రస్ట్ ద్వారా రూ.50వేల చెక్కును అందజేశారు. అమీర్‌పేట కార్పొరేటర్ సరళ మాట్లాడుతూ, అమీర్‌పేటలో పెట్టనున్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తయారు చేయిస్తానన్నారు. ఎస్.ఆర్.నగర్ కమ్మ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌నాయుడు, రాఘవ మాట్లాడుతూ, సంఘం ద్వారా పేద కమ్మ వారికి సహాయం చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాజారాం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో బోర్ వెల్ ప్రారంభోత్సవంలో బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జీ మాధవరం కాంతారావు

అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి నిధుల మంజూరు

బేగంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని అల్లం తోటబాయిలో ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో పలు పనులకు సంబంధించి ఈటల రాజేందర్ ఎంపీ నిధుల నుంచి రూ.13 లక్షలు మంజూరయ్యాయి. కమ్యూనిటీ హాల్‌లో బోర్ నిర్మాణంతో పాటు రెండోఅంతస్తు కోసం ఈ నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా వేసిన బోర్‌వెల్‌ను బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జీ మాధవరం కాంతారావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, మాజీ అధ్యక్షులు రాజలింగం, శ్రీరాములు, బీజేపీ నాయకులు గంగాధర్‌గౌడ్, విజయకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఎర్రగడ్డ, హిందూ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ మహాత్మానగర్, ఆర్బీఐ క్వార్టర్స్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న మైనర్, మరో వ్యక్తి అరెస్ట్

అమీర్‌పేట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా మాదక ద్రవ్యమైన హాష్ ఆయిల్, గంజాయి విక్రయిస్తున్న ఓ బాలుడితో సహా ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్ సమీపంలోని బాపూనగర్‌లోని ఓ ఇంట్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. బాలుడు (17)తో పాటు తిరుమలరావు అనే మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5లక్షల విలువ చేసే కేజీ హాష్ ఆయిల్, 15 గ్రాముల గంజాయి, మత్తును కలిగించే నార్కోటిక్ సబ్జెన్స్ అయిన ఓసీబీ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మహారాష్ట్రలో అన్షద్ అనే వ్యక్తి వద్ద వీటిని కొనుగోలు చేసి, నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వీరికి మాదక ద్రవ్యాలను విక్రయించిన అన్షద్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారు.

సైబర్ నేరగాళ్ల చేతుల్లో చిక్కి.. రూ.లక్ష హాంఫట్

ఏడు దఫాలుగా చెల్లించి మోసపోయానని తెలుసుకున్న విద్యార్థి

అమీర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతుల్లో చిక్కి మోసపోయిన ఓ విద్యార్థి రూ, 97,540 పోగొట్టుకున్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన విద్యార్థి పల్లా నరేంద్ర (22)కు ఈనెల 1న ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా చెప్పుకున్నాడు. ట్రూ కాలర్లో కూడా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గానే కనపడుతుండడంతో విద్యార్థి నమ్మాడు. షేర్ చాట్ వారు ఫిర్యాదు చేశారని, కేసు నమోదయ్యిందని నరేంద్రను భయపెట్టాడు. ఫోన్లో మాట్లాడుతుండగా అవతలి నుంచి వాకీటాకీల శబ్దం కూడా వినిపిస్తుండడంతో బాధితుడు నిజమైన పోలీసులేనని భయపడ్డాడు. కేసును మాఫీ చేయాలంటే కొంత ఫీజు చెల్లించాలనడంతో 1 నుంచి 3వ తేదీ వరకు 7 దఫాలుగా మొత్తం 97,540 చెల్లించాడు. ఆ తర్వాత అవతలి వ్యక్తి మొత్తం ఫోన్లో వివరాలన్నీ ఎరేజ్ చేయాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూత దిశగా..
ఒక్కొక్క విభాగం..!

శిథిలావస్థలో ఎర్రగడ్డ ఛాతివ్యాధుల ఆస్పత్రి

- వార్డుల కొరత.. అందని సేవలు
- యాజమాన్యం నిర్లక్ష్యంతో రోగుల అవస్థలు

ఎర్రగడ్డలోని ఛాతి వ్యాధుల ఆసుపత్రి



ఎర్రగడ్డ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ఛాతివ్యాధుల ఆస్పత్రి.. ఇది నగరంలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో పేరెన్నికగన్నది. ఛాతివ్యాధులకు, టీబీకి సంబంధించి రాష్ట్రాల నుంచి రోగులు వచ్చి ఇక్కడ చికిత్స పొందుతుంటారు. రోజుకు వందలాది మంది ఓపీలో చికిత్స పొందుతుండగా.. మరి కొంత మంది ఆస్పత్రిలో చేరుతుంటారు. ఆస్పత్రిలో చేరేవారికి సరైన వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో మూతపడ్డ విభాగాలు అనేకం ఉన్నాయి. మూతపడ్డ విభాగాలను తిరిగి పునరుద్ధరించడానికి అటు ప్రభుత్వం గానీ.. ఇటు ఆరోగ్యశాఖ, ఆస్పత్రి యాజమాన్యం గానీ చొరవ చూపక పోవడంతో రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు. గతంలో శిథిలావస్థలో ఉన్న కారణంగా ఫీమేల్, మేల్, స్పైన్‌ఫ్లూ వార్డులను పూర్తిగా మూసివేశారు. ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి మూలంగా రోగులు ప్రమాదాలకు గురవుతారన్న ఉద్దేశంతో ఆ విభాగాలను మూసివేశారు. దాంతో మిగతా వార్డుల్లోనే రోగులందరినీ ఉంచడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నూతన భవనం కేర్ అండ్ సపోర్ట్ సెంటర్‌లోనే రోగులందరికి చికిత్స అందిస్తున్నారు. అంతే కాకుండా ఆస్పత్రిలో రోగుల సహాయకుల కోసం నిర్మించిన విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంట శాలలు కూడా మూతపడినా.. ఆస్పత్రి యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో రోగుల సహాయకులు చెట్ల కిందే సేదతీరుతున్నారు. రోగులు వంటశాల పక్కనున్న ఆస్పత్రి మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయానికి తాళం వేసి కొన్నేళ్లుగా తెరవడం లేదు. దీనినిబట్టి చూస్తే ఆస్పత్రిలో యూనియన్ ఉందా లేదా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఆస్పత్రి కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ పక్కన ఉన్న స్టాఫ్ క్వార్టర్స్ గదులు పాడవడంతో వాటిని ఉపయోగించడమే మానేశారు. ఇలా ఆస్పత్రిలో ఎన్నో విభాగాలు మూతపడినా.. యాజమాన్యం పట్టించుకోక పోవడం వల్ల రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మూతపడ్డ విభాగాలు తెరవడానికి ప్రభుత్వం, ఆస్పత్రి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.



ఆస్పత్రిలో మూతపడిన ప్రధాన విభాగం



తాళాలు తెరవని మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం



రోగుల సహాయకుల విశ్రాంతి గదులు



మూతపడిన స్టాఫ్ క్వార్టర్స్

ప్రతీ ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకోవాలి : ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన ఆరోగ్య పరంగా రాబోయే ప్రమాదాలను అధిగమించే అవకాశం ఉంటుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం అమీర్‌పేట డివిజన్‌లోని శివబాగ్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షల ద్వారా మన ఆరోగ్య పరిస్థితి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు సూచనలు చేస్తారని, దాంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి వివరిస్తూ వారిని ప్రశంసించారు. పేదలు అధికంగా నివసించే ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని లయన్స్ క్లబ్ సభ్యులను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, లయన్స్ క్లబ్ గవర్నర్ అమర్నాథ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

వన భోజనాలతో ఐక్యత

వన భోజనాల ద్వారా సమాజంలో మరింత ఐక్యత పెరుగుతుందని ఎమ్మెల్యే తలసాని అన్నారు. సనత్‌నగర్ గ్రీన్ పార్క్-2లో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్‌రెడ్డి, క్యావెల్ స్కూల్ గ్రౌండ్‌లో పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వన భోజనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. గ్రీన్‌పార్క్‌లో ముందుగా తలసాని ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి, వన భోజనాలు వడ్డించారు. అదేవిధంగా పద్మశాలి సంఘం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, రాజేష్, ఫాజిల్, వసీం, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ సభ్యులు పార్థసారధి, మాణిక్‌రావ్‌పాటిల్, తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి సారిద్దాం: గౌతంరావు



జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గౌతంరావు, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఓటమిని అధిగమించి భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి సారించాలని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతంరావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో విజయం కోసం ప్రతీ ఒక్కరు కష్టపడ్డారన్నారు. అయితే కొన్ని అంశాల కారణంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే పోటీ నెలకొందని తెలిపారు. డబ్బు.రాజకీయాలకు బీజేపీ ఎప్పుడూ దూరంగా ఉంటుందని, ఇక ఈ ఓటమి నుంచి పాఠం నేర్చుకొని భవిష్యత్తు కోసం సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కమిటీలను మరింత పటిష్ఠం చేసుకోవాలని సమావేశంలో సూచించారు.

ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నాయకులు కుంభాల గంగరాజు, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



శ్రీనగర్‌కాలనీ ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

బంజారాహిల్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భక్తులకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యులు కృషిచేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ అన్నారు. శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్ప ఆలయంలో మండల పూజల సందర్భంగా ఆదివారం అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయం కలియ తిరిగి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వేల మంది అయ్యప్పలకు అన్నదానం చేసేందుకు ట్రస్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తన సహకారం ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. అంతకు ముందు అయ్యప్ప ఆలయంలో మండల పూజల్లో భాగంగా గణపతి హోమం, అయ్యప్ప ప్రత్యేక అభిషేకం, ధ్వజారోహణం వంటి పూజాధికాలు జరిగాయి. సాయంత్రం స్వామివారికి పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ, ట్రస్టు బోర్డు చైర్మన్ అర్జున్‌యాదవ్, సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ అర్చకులు శ్రీనివాస్‌శర్మ, రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తన విజయం కోసం శ్రమించిన మంత్రులను ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులను కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. అనంతరం పలు విషయాలపై ఎమ్మెలే వారితో చర్చించారు.



మంత్రి తుమ్మల నాగేశ్వర రావును కలిసిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

సమస్యలను పరిష్కరిస్తా

వెంగళరావునగర్, (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయనను వెంగళరావునగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్లూరి రవి, కబీర్ దాస్ నరసింహ,తదితరులు కలిసి అభినందించారు. డివిజన్‌లో అత్యధిక మెజారిటీ ఇచ్చినందుకు ఆయన వారిని అభినందించారు.





దేవాలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ

మహా పడిపూజలో ఎమ్మెల్యే

తిరుమలగిరి, నవంబరు, 16 (ఆంధ్రజ్యోతి): బొల్లారం టీఏటీ క్వార్టర్స్ సమీపంలో ఉన్న శ్రీరేణుక మాత దేవాలయంలో శ్రీసాయి అన్నదాన సమితి అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కదీరవన్ రాజగోపాలన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు లోకనాథం, శ్రీశైలం యాదవ్, నరహరి, మహేందర్ పాల్గొన్నారు.



బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

వైద్య సేవలకు సహకారం: ఎమ్మెల్యే

బౌద్ధనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వైద్య సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. మైలార్‌గడ్డకు చెందిన ధాత్రిక రిషిక(22) అనారోగ్యంతో బాధపడుతుందన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యువతి చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ2లక్షలు విలువచేసే లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ) పత్రాన్ని ఆదివారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలి బంధువులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకు రామచందర్, బాలరాజ్‌గౌడ్, మురళీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

సత్యనారాయణస్వామి వ్రతాలు

రెజిమెంటల్‌బజార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో కార్తీక పూర్ణిమ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిత్యం వైభవంగా సాగుతున్నాయి. ప్రతిరోజు భక్తులతో ఆలయం ఆధ్యాత్మిక సందడి నెలకుంటోంది. ఆదివారం సెలవు కాబట్టి రెట్టింపు సంఖ్యలో వ్రతాలు జరుగుతున్నాయి. కార్తీకమాసం ముగియనుండటంతో ఆదివారం 320 సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. మంగళవారం ఉమామహేశ్వరస్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు తెలిపారు.



పోటీల్లో గెలిచిన చిన్నారులతో జంపన

స్కూల్ గేమ్స్ విజేతలకు సత్కారం

సికింద్రాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 69వ స్కూల్ గేమ్స్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన చిన్నారులను కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ జంపన ప్రతాప్ ఘనంగా సత్కరించారు. జిల్లా స్థాయిలో జరిగిన రైటింగ్ పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థి ఎన్.ద్వారకామణితోపాటు కబడ్డీ తదితర పోటీల్లో గెలుపొందిన చిన్నారులను శాలువాలతో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాలా ఏళ్ల నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. బోయినపల్లి ప్లేగ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, కరణ్‌సింగ్, శివ, అరుణ్‌యాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరం



సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

తిరుమలగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్, తిరుమలగిరి డివిజన్ ఏసీపీ రమేష్‌ల ఆదేశాల మేరకు తిరుమలగిరి చౌరస్తాలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సైబర్ నేరస్తుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శాస్త్ర, సాంకేతికరంగం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అదే స్థాయిలో సైబర్ నేరాలు సైతం అధికంగా జరుగుతున్నాయని వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అపరిచితుల నుంచి ఫోన్, గుర్తు తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని, డిజిటల్ అరెస్ట్ అని ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు అడిగితే నమ్మకూడదని అలాంటి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈజీ మనీ కోసం విద్యావంతులు సైతం ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న తరుణంలో పౌరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అవగాహన సదస్సులో డీఐ విజయ్‌రాజ్, ఎస్సై మనోజ్, ఎస్పీఓ శర్వాన్, కానిస్టేబుల్ ప్రమోద్‌లు పాల్గొన్నారు.



అన్నకూట మహోత్సవంలో పాల్గొన్న బోర్డు సీఈఓ అరవింద్ ద్రివేది, బానుక నర్మద, సీఐ తిరుపతి రాజు, ఈఓ నరేందర్



స్వామివారి ముందు పోసిన అన్నపురాశి



అన్నకూట మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వైభవంగా అన్నకూట మహోత్సవం



స్వామివారికి హారతి ఇస్తున్న ఆలయ పూజారి

బోయినపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో కొన్ని వైష్ణవ సంప్రదాయాల్లో ప్రతి ఏటా విశేషమైన అన్నకూట మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాన్నే గోవర్ధన పూజగా కూడా పిలుస్తుంటారు. హిందూ ఆనవాయితీలో భాగంగా సికింద్రాబాద్ తాడ్‌బండ్ దేవస్థానంలో ఆదివారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో యాభై ఆరవ భోగ మహా అన్నకూట మహోత్సవం ఈఓ నరేందర్ పర్యవేక్షణల్లో వైభవంగా సాగింది. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో అభిషేకాలు, మహా హారతులు ఇచ్చారు. అన్నాన్ని స్వామివారి ఎదుట పెద్ద రాశిగా పోసి, పిండి పదార్థాలు యాభై నాలుగు రకాల మిఠాయిలను, పాలతో చేసిన నూట రెండు వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా భక్తి బృందం వారు చేసిన భగవాన్ నామ సంకీర్తనలు భక్తి భావాన్ని పెంచింది. ఈ ఉత్సవం ద్వారా మానవులు భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుతామని భక్తుల నమ్మకమని ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణ తెలిపారు. ఈ అన్నకూట సమర్పణ తర్వాత మహా హారతుల అనంతరం స్వామివారి దివ్య జ్యోతి దర్శనం కల్పించారు. దివ్యజ్యోతి కార్యక్రమం జరుగుతున్నంత వరకు జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అనే నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగిపోయింది. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ అరవింద్ ద్రివేది, కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద, బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజులు హాజరై పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు బీజేపీ నాయకులు బానుక మల్లిఖార్జున, బీఎస్ శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులు, పెద్దఎత్తునభక్తులు తరలివచ్చారు.



తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయంలో ఆదివారం జరిగిన అన్నకూట మహోత్సవం, దివ్యజ్యోతి సందర్శన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

నూతన రోడ్లను నిర్మించండి

బౌద్ధనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో రోడ్లు అధ్వానస్థితికి చేరుకున్నాయి. దీంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఉన్న దుమ్ములేచి ఇళ్లలోకి వస్తుందని, దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. అధ్వాన రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు పదినెలల క్రితం సీవరేజీ, మంచినీటి పైపులైన్ మరమ్మత్తుల కోసం రోడ్లను తవ్వారని, మరమ్మతులు పూర్తయినా ఇప్పటివరకు నూతన రోడ్లను నిర్మించలేదని వాపోతున్నారు. గుంతలు పడిన రోడ్లపై వర్షపునీరు, మురుగు నిల్వ ఉండటంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో నూతన రోడ్లను నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన వారు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బ్రాహ్మణబస్తీలో అధ్వానస్థితిలో రోడ్లు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కృష్ణారెడ్డి(ఫైల్)

బోయినపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉంటున్న ఓ వ్యక్తి పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటూ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని డైరీ ఫామ్ రోడ్, ఓల్డ్ బోయినపల్లిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలకు చెందిన వేము కృష్ణారెడ్డి (63) భార్యతో విడాకులు కావడంతో పది సంవత్సరాలుగా ఓల్డ్ బోయినపల్లిలోని ఓ పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటున్నాడు. అయితే మూడు రోజులుగా దగ్గరి బంధువైన ఎ.మామిని అతడికి ఎన్నిసార్లు చేసినా స్పందించడం లేదు. ఈ క్రమంలో ఎ.మామిని హైదరాబాద్‌కు వస్తున్న వారి కుటుంబ స్నేహితుడు వేణును అతడి గురించి తెలుసుకోమని చెప్పాడు. అయితే వేణు పెంట్‌హౌస్‌కు చేరుకుని తలుపు తట్టినప్పటికీ స్పందన రాకపోవడంతో వేణు తలుపు పగలగొట్టి చూసేసరికి వేముల కృష్ణారెడ్డి తాడుతో ఇనుపరాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనను చూసి వెంటనే బంధువులకు సమాచారం అందించాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆరోగ్య సమస్యలు, ఒంటరితనం కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఫిర్యాదుదారుడు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.



అందెశ్రీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీఎం సతీమణి గీతా రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి

అందెశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డి

తార్నాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డి తెలిపారు. ఇటీవల అందెశ్రీ లాలాపేట్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సతీమణి గీతా రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి ఆదివారం లాలాపేట్‌లోని అందెశ్రీ నివాసానికి చేరుకుని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. 'మీకు ఏ కష్టమొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళల అండగా ఉంటుంది. ఏదైనా అవసరముంటే నా దృష్టికి తీసుకువస్తే వెంటనే సహాయం చేసేందుకు కృషి చేస్తాను' అని అందెశ్రీ కుటుంబసభ్యులకు గీతా రెడ్డి భరోసా ఇచ్చారు.



వాల్ రైటింగ్ రాస్తున్న ఏఐఎస్ఎఫ్ బృందం

ఏఐఎస్ఎఫ్ మహాసభలకు ఏర్పాట్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ ఆడిటోరియంలో ఈ నెల 25న నిర్వహించే ఏఐఎస్ఎఫ్ 25వ మహాసభలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నారు. అందులో భాగంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ బృందం ఇలా వాల్ రైటింగ్ రాస్తున్నారు.



నూతన కమిటీ సభ్యులతో యాదవ సంఘం ప్రతినిధులు

మల్లాపూర్ యాదవ సంఘం అధ్యక్షుడిగా సంతోష్ యాదవ్

తార్నాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ యాదవ సంఘం అధ్యక్షుడిగా గండు సంతోష్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం మల్లాపూర్‌లో సమావేశమైన యాదవ సంఘం ప్రతినిధులు నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండు సంతోష్ యాదవ్, సెక్రటరీగా కేశవైనా మహేష్ యాదవ్. త్వరలో పూర్తి స్థాయి కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ బోడు శ్రీనివాస్ యాదవ్, కేశవైన కృష్ణ, బొడ్డు భిక్షపతి యాదవ్, గుంటి ఐలయ్య యాదవ్, అప్పల శ్రీశైలం యాదవ్, బొడ్డు నర్సింగ్ యాదవ్, గడ్డం శ్రీశైలం యాదవ్, మేకల ఎల్లేష్ యాదవ్, పల్లే కుమార్ యాదవ్, కుల పెద్దలు పాల్గొన్నారు.



చర్లపల్లి ఐలా మాజీ చైర్మన్ రోషిరెడ్డిని సన్మానిస్తున్న ఫేజ్-1 చిన్న పరిశ్రమల సంఘం నూతన కార్యవర్గం

చిన్న పరిశ్రమల సంఘం కార్యవర్గం ఎన్నిక

కుషాయిగూడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి పారిశ్రామిక వాడకు చెందిన చిన్న స్థాయి పరిశ్రమల సంఘం ఫేజ్-1 కార్యవర్గం ఎన్నికైంది. శనివారం జరిగిన ఎన్నికల ఫలితాల్లో 'పెన్' ప్యానెల్ అన్ని పదవుల్లో విజయం సాధించింది. అధ్యక్షుడిగా ఎస్.దస్తగిరి రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎన్.బసంత్, ప్రధాన కార్యదర్శిగా జి.హనుమాన్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా కె.కె.రాజు, కోశాధికారిగా కె.అరుగ్నా కుమారి, కార్యవర్గ సభ్యులుగా కె.రవిబాబు, ఎం.ఎం.శ్రీనివాస రావు, పి.శ్రీనివాస్ రావు, జె.శేషావతి, ఎం.గౌరవ్ భట్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ఫేజ్-1లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు.

జర్నలిస్టుల పాత్ర సమాజ నిర్మాణంలో గొప్పది

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజనిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని సెంట్రల్ క్రైమ్‌స్టేషన్, చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీలు వెంకటేష్, ఎల్. రమేష్‌కుమార్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టీఎస్‌జేయూ)ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రముఖ జర్నలిస్ట్ ఉదయ్‌భాస్కర్‌ను సన్మానిం చి మాట్లాడుతూ సమాజానికి సరైనదిశ చూపడం జర్నలిస్టుల ధర్మమన్నారు. వా ర్తల వేగంకన్నా వాటి నిజస్వరూపం ముఖ్యమన్నారు. టీఎస్‌జేయూ అధ్యక్షుడు పురుషోత్తం నారగోని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ నేత లు అనిల్ కుమార్, వాసు, చంద్రమోహన్, ముఖేష్‌గౌడ్, ఆంజనేయులు, రియాజ్, విష్ణుమోహన్, చంద్రమౌళి, మహేందర్, వెంకటేష్, గణేష్ రెడ్డి పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్ ప్రతినిధులతో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తదితరులు

ఉచిత హెల్త్ క్యాంప్ ప్రారంభం

తార్నాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఖుదిరాం మెమోరియల్ డయాబెటిక్ ట్రస్ట్, కందర్ డయాబెటిస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో ఉచిత మెగా డయాబెటిక్ హెల్త్, ఒబేసిటి స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌ను కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, ఉపాధ్యక్షురాలు బండ కార్తీకా చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కందర్ డయాబెటిక్ సెంటర్ ఎండీ డాక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో ఫిజికల్ యాక్టివిటీస్ తగ్గి మెంటల్ టెన్షన్ ఎక్కువ అవుతుందని, దాంతో చాలామంది డయాబెటిస్ బారిన పడుతున్నారని అన్నారు. బ్యాలెన్స్ న్యూట్రిషన్, రెగ్యులర్ ఫిజికల్ యాక్టివిటీ, ఒత్తిడిని తగ్గించుకోవడం, వంటి జాగ్రత్తలు తీసుకుంటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేశ్వర్ రెడ్డి, మేకల సారంగపాణి, వెంకటేశ్ గౌడ్, పోచయ్య యాదవ్, ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్

హక్కుల సాధనకు నిరంతర పోరాటం : స్వామిగౌడ్

తార్నాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల హక్కులను కాపాడేందుకు బీసీ విద్యార్థి జేఏసీ నిరంతరం పోరాడుతుందని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్ అన్నారు. ఇటీవల నిజాం కళాశాలకు చెందిన మిట్టపల్లి హర్ష అనే దళిత విద్యార్థిని అకారణంగా మూడు నెలలు సస్పెండ్ చేసి మానసిక వేదనకు గురి చేయడం జరిగిందని తెలిపారు. దాంతో బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఆశ్రయించారు. కమిషన్ విద్యార్థికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో తిరిగి కాలేజీ అడ్మిషన్, హాస్టల్ వసతి, అన్ని పరీక్షలు నిర్వహించేవిధంగా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థికి న్యాయం చేసిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు గణేష్ గౌడ్, అరవింద్, శివ యాదవ్, శ్రవణ్, లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమ్మవారి సేవా సమితి సభ్యులు

ఘనంగా కార్తీకమాస వన భోజనాలు

తార్నాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాస వన భోజనాల విశిష్టతను, సనాతన ధర్మాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి ప్రతినిధులు మందపాటి సురేష్ బాబు, కందేటి వెంకటేశ్వర రావు, గటికంటి మురళీ కృష్ణ, ఉన్నం శ్రీనివాస రావు, గుత్తికొండ శ్రీనివాస రావు, రావి జయధీర్, ఉన్నం వెంకటేశ్వర్లు, పోలవరపు శ్రీనివాస ప్రసాద్, అడుసుమిల్లి చిట్టి వీరయ్య, నడిపినేని శేషాద్రి, వల్లభనేని వీరభద్రయ్య, జీజీ నాయుడు, కుర్రా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న లక్కరాజు నిర్మల

బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆంధ్రమహిళా సభ మామిడిపూడి రంగయ్య హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు, దంపతులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ లక్కరాజు నిర్మల "విశ్వ నియమాలు- విశ్వ రహస్యాలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తోటవర్తి గోపాల కృష్ణ, బ్రహ్మ గందం, నెమలికంటి కృష్ణమూర్తి, డా. కిరణ్ కుమార్, డా.హర్షిత తదితరులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

హైదరాబాద్ ఆర్చి బిషప్ ఆఫ్, ఎమినెన్స్ కార్డినల్ పూల ఆంథోనిని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్రైస్తవ ప్రముఖులు రాయ్‌డిన్ రోచ్, మైఖేల్ అబ్రహం, రేమండ్ హోవర్డ్,నరేష్ కుమార్, గోనే సాల్మన్, క్లారెన్స్ డన్, అమల తదితరులు పాల్గొన్నారు.

- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి



మహా ధర్నా

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నేడు ఢిల్లీలో జరిగే మహాధర్నాలో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఇటుక శ్రీకిషన్, టి.వి.నరసింహారావు, మంద మధుకర్, బ్యాగరి నరసింహ, బాబేందర్, రంజిత్, అనిల్, పెద్ది రమేష్, సంపత్‌లు ఆదివారం బయల్దేరారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి